# దేహియే దేవదేవుడు

ప్రేమస్వరూపులారా!

నా ముందు మాట్లాడినవారు ఎంతో చక్కని విషయాలు చెప్పారు. వారి మాటలను విన్న తరువాత నేనసలు ఈరోజు మాట్లాడాలని అనుకోలేదు.

**అన్నదానముకన్న అధిక దానంబేది!**
**తల్లిదండ్రులకన్న దైవమేది!**
**జప తపంబులకన్న సత్య శీలంబేది!**
**దయకంటె ఎక్కువ ధర్మమేది!**
**సుజన సంగతికన్న చూడ లాభంబేది!**
**క్రోధంబుకన్న శత్రుత్వమేది!**
**ఋణముకంటెను నరులకు రోగమేది!**
**ధరణి నపకీర్తికంటెను మరణమేది!**
**సర్వదా కీర్తికంటెను సంపదేది!**
**స్మరణకంటెను మించు ఆభరణమేది!**

ప్రేమస్వరూపులారా! లోకంలో మనము అన్నగత ప్రాణులం. అది లేక క్షణమైనకూడను మనము జీవించలేము. అన్నము ఎక్కడినుండి వస్తున్నది? అనంతుడైన, అద్వితీయుడైన, అవాఙ్మానస గోచరుడైన శంకరునినుండియే ఆవిర్భవించుచున్నది. ఈ ప్రపంచములో కనిపించునటువంటి సమస్త వస్తువులు కూడను భగవంతునియొక్క సృష్టియే. భూత, భవిష్యత్, వర్తమానములలో కనిపించేవన్నికూడను దైవసృష్టియే. ఇట్టి సత్యాన్ని గుర్తించుకున్నటువంటిది ఒక్క పార్వతి మాత్రమే. దేవతలు వచ్చి, “నీవు బాలవే కద గౌరమ్మా! సాంబ శివుడు ముసలివాడమ్మా! అట్లాంటివాడిని నీవెట్లా పెండ్లి

sri sathyasai vahamrutam

చేసుకుంటున్నావు?" అని ప్రశ్నించారు. అప్పుడు పార్వతి నవ్వుతూ, "బాహ్యస్వరూపాన్ని మాత్రమే చూసి మీరు అదే సత్యమని భ్రమిస్తున్నారు. అలౌకికమైన, శాశ్వతమైన ఆత్మతత్త్వమును మీరు గుర్తించకుండా దేహమునకు, మనస్సుకు, బుద్ధికి పరిమితమైన దృష్టితో అందచందములను, ఆస్తిపాస్తులను చూస్తున్నారు. కనుక, మీకు అవే కనిపిస్తున్నాయి. లోన ఉన్నటువంటి సూక్ష్మమైన స్వరూపాన్ని మీరు గుర్తించటం లేదు. అదే దైవత్వము. అతను దేహము కాదు, మనస్సు కాదు; లింగాకారుడై ఉంటున్నాడు, స్వామి. ఆ లింగము ఎవ్వరికీ కనిపించదు. అది అతని కంఠమునందు ఉంటున్నది. అట్టి స్వరూపాన్ని గుర్తించినదానను నేను. కనుకనే, నేనతనిని వరిస్తున్నాను. బాహ్యరూపము మాత్రమే మీకు కనిపిస్తుంది. కాని, భగవంతుడు మీకు కనిపించే రూపానికి పరిమితం కాదు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్'. అట్టి ఆకారమును గుర్తించి నప్పుడు మీరు భౌతికమైన రూపాన్నిగురించి ఏమాత్రం యోచించరు; 'సాంబశివుడు వృద్ధుడే! వృద్ధుడే!' అని అనుకోరు", అన్నది. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. గౌరికి తాను అన్నివిధాలుగా తగినవాడుగా కనపడ్డాడు. ఈడు, జోడు చక్కగా సరిపోయింది. దేవతలందరూ ఆశ్చర్యపడ్డారు.

ఈవిధంగానే లోకులు భ్రమించేది ఒకటి, జరిగేది మరొకటి. అంతర్భూతమైన సత్యాన్ని అందరూ గుర్తించుకోలేరు. లోకులు కేవలం అందచందములను, భౌతికమైన ఆనందమును ఆశిస్తారు. సత్యస్వరూపుని గుర్తించటానికి సత్య స్వభావము అత్యవసరము. భగవంతుని ఆకారము 'ఇట్టిది, అట్టిది' అని ఎవ్వరూ చెప్పలేరు.

**బ్రహ్మాండమంతయు ప్రబలుచుండెడి తనకు**
**ఆలయంబు నమర్చ అలవియగున!**
**కోటిసూర్యుల కాంతి మేటి కల్గిన తనకు**
**ప్రమిద దీపము నెవరు పట్టగలరు!**
**సర్వజలములయందు సంచరించెడి తనకు**
**స్నానంబు చేయింప సాధ్యమగున!**

sri sathyasai vahanamrutam

**సర్వజీవులయందు సంచరించెడి తనకు**
**సరియైన పేరిడ సాధ్యమగున!**
**బ్రహ్మాండమంతయు బొజ్జలో నుండగ**
**భక్ష్య భోజ్యములు తనకు పెట్ట తగున!**

భగవత్స్వరూపము అత్యంత సూక్ష్మమైనది. అదియే ఇది *(భగవాన్ ఒక లింగాన్ని సృష్టించారు. ఎదురుగా ఉన్న 'సాయీశ్వర' లింగమును చూపిస్తూ)* అది ఏవిధంగా ఉందో ఇది కూడా అదేవిధంగా ఉంది.

**దైవానికి ఇచ్చినది వెయ్యింతలై మనకు తిరిగి వస్తుంది**

లోకులు కాకులు; అజ్ఞానాంధులై బాహ్యమైన ఆకారమును మాత్రమే చూస్తుంటారు. దైవత్వమును ఎవరూ గుర్తించుకోలేరు. ఈనాడు చాలామంది ఆంగ్లభాషా ప్రవీణులు, ఆధునిక విద్యావంతులు, "ఏమిటిది! ఎంతోమంది బీదలు అన్నం లేక అల్లాడి పోతుంటే మీరు ఇంత ధాన్యమును, ఇంత నెయ్యిని అగ్నిలో వేసి వ్యర్థం చేస్తున్నారే! దానికి బదులు బీదలకు అన్నం పెట్టవచ్చు కదా!" అంటారు. అటువంటివారికి మన ప్రధాన అర్చకునివంటి వేదాంతులు ఈవిధంగా బుద్ధి చెబుతారు: "అయ్యా! రైతు ఐదు మూటల వడ్లను నీటిలో వేసి, వాటికి మొలకలు వచ్చిన తర్వాత తీసుకు పోయి మట్టిలో చల్లుతున్నాడు. రైతు చేసేది మంచిపని కాదని ఎవరైనా చెప్పగలరా? వాటిని బురదలో చల్లడం వల్లనే కొన్ని రోజుల తరువాత యాభై మూటల వడ్లను తాను ఇంటికి తెచ్చుకోగల్గుతున్నాడు. అట్లే, మన ఋత్విక్కులు చేసే పూజలు, హోమాలు గొప్ప ఫలితము నందించునవేగాని, వ్యర్థమైనవి కావు. ఈనాడు భగవంతునికి అర్పితము చేసినటువంటి ధాన్యము, నెయ్యి ఇవన్నీ భవిష్యత్తులో ఎంతో గొప్ప ఫలితాన్నిస్తాయి. రైతు మట్టిలో చల్లిన ఐదు మూటల వడ్లు తరువాత యాభై మూటలైనట్లుగా, ఈ యజ్ఞంలో అగ్నిహోత్రునికి ఆహుతి చేసిన సమస్త పదార్థములుకూడను ఎన్నో రెట్లు అధికమవుతున్నాయి." మనము దైవానికి అర్పితము చేయవలసినది ఏమిటి? మన హృదయములో ఉన్న కోరికలన్నీ దైవానికి అర్పితం చేయాలి. సర్వసంగ పరిత్యాగులమై ఎన్ని అర్పితం చేసినామో ఆ భావములన్నికూడను భవిష్యత్తులో

sri sathyasai vachanamrutam

ఎంతో గొప్ప ఫలితాన్ని అందిస్తాయి. కాని, ప్రాకృత మానవులు ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక బాహ్యమైన విషయాలను మాత్రమే గుర్తిస్తున్నారు. దైవానికిచ్చిన ప్రతి ఒక్కటీ వెయ్యింతలై తిరిగి వస్తుంది.

**బాహ్యస్వరూపము కేవలం ఒక 'ప్యాకేజి' వంటిది**

లోకుల దృష్టి బాహ్యస్వరూపానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. బాహ్య స్వరూపము కేవలం ఒక ప్యాకేజి వంటిది. ప్యాకేజిని తొలగిస్తేగాని పదార్థము మనకు కనిపించదు. దైవత్వమనేది ఈ ప్రకృతిలో పంచభూతములచేత కప్పబడి ఉన్నది. అంతేగాక, మానవుని ఆవరించిన అరిషడ్వర్గములవలన అది కంటికి కనిపించకుండా ఉన్నది. ఈ 'ప్యాకేజి'ని తీసేసెయ్, అప్పుడు నీకు చక్కని ఆనందమయమైన దైవస్వరూపం సాక్షాత్కరిస్తుంది. కేవలం 'ప్యాకేజి'పైన దృష్టి పెట్టకూడదు. 'ప్యాకేజి' అందంగా ఉండవచ్చు. కాని, దానిని తెరచి చూస్తే తప్ప లోపలి వస్తువు ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. చాలామంది 'ప్యాకేజి'ని మాత్రమే చూసి మోసపోతుంటారు. దివ్యత్వానికి సంబంధించిన విషయం అటువంటిది కాదు. బాహ్య దృష్టికి భౌతికమైన దేహం మాత్రమే కనిపిస్తుంది.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

ఆ దేవదేవుని తత్త్వమే ఈవిధంగా దేహములో 'ప్యాక్' చేయబడి ఉంది. కనుక, మనము ఈ 'ప్యాకేజి'ని మాత్రమే చూసి తృప్తిపడకూడదు. దైవత్వము నీయందే ఉన్నది. నీవే దైవం. దైవం సర్వవ్యాపి. కాబట్టి, నీవుకూడా సర్వవ్యాపివే. దైవత్వం నీయందు, సర్వ జీవులయందుకూడను ఉంటున్నది. దైవత్వమును దర్శించాలంటే నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన జీవితాన్ని గడుపు. కంటికి కనిపించే భిన్నత్వమంతయు వ్యర్థమైనదే! భిన్నత్వమును దూరము చేసుకొని ఏకత్వమును అభివృద్ధిపరచుకో. 'యూనిటీ' ఉన్నచోట

sri sathyasai vachanamrutam

'ప్యూరిటీ' ఆవిర్భవిస్తుంది. 'ప్యూరిటీ' ఉన్నచోట 'డివినిటీ' సాక్షాత్కరిస్తుంది. నీవు ఒక్క వ్యక్తివి కావు; నీలో ముగ్గురు ఉన్నారు. 1. The one you think you are (నీవనుకునే నీవు) 2. The one others think you are (ఇతరులనుకునే నీవు) 3. The one you really are (అసలైన నీవు). ఆత్మతత్త్వమే నీవైయుండి కేవలం దేహమనోబుద్ధులపై ఆధారపడి జీవిస్తున్నావు. ఇవన్నీ కూలిపోయేటటువంటివే! రాలిపోయేటటువంటివే! దీనిగురించి మున్ముందు మీకు బోధిస్తాను.

*(భగవాన్ 'శివ శివ శివ శివ అనరాదా ....' అనే పాట తాము పాడి భక్తులచేత పాడించారు. తదుపరి తమ దివ్యోపన్యాసమును కొనసాగిస్తూ....)*

'నమశ్శివాయ' – ఈ ఐదక్షరముల మంత్రము ఎంతో మహత్తరమైనది. 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం.' ఇట్టి తత్త్వాన్ని నీవు హృదయంలో పెట్టుకోవాలి. బ్రహ్మ సృష్టికర్త అని, విష్ణువు రక్షణకర్త అని, శివుడు లయకర్త అని లోకములో బాహ్యమైన అర్థములు చెబుతూ వస్తున్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వేరువేరు కాదు; ముగ్గురూ చేరి ఒక్కరే. నీవు తాంబూలం వేసుకోవాలంటే తమలపాకులు, వక్క, సున్నం మూడూ కావాలి కదా! ఈ మూడూ చేరినప్పుడే ఎరుపురంగు వస్తుంది. ఈ 'రెడ్ కలర్' తమలపాకులనుండి వచ్చిందా? వక్కనుండి వచ్చిందా? లేక సున్నం నుండి వచ్చిందా? కాదు, కాదు. మూడూ ఏకం కావడంచేత ఎరుపురంగు ఏర్పడింది. అదేరీతిగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఏకత్వమే దైవత్వం. ఇట్టి దైవత్వాన్ని మీరు వేరువేరుగా భావించి మనస్సును చెడగొట్టుకోకండి.

ఒకానొక సమయంలో పార్వతి ఈశ్వరుని ప్రార్థించిందట, ఒక ఇల్లు కట్టుకుందామని. 'అయ్యా, ఊరూరు తిరుగుచు తిరిపమెత్తుటెగాని, ఇంటిపట్టున కూటికిరవు లేదు. తలదాచుకొనుటకొక ఇల్లు లేదు. ఇట్టి సంసారంబు నేనెట్లు చేతు?' అన్నదట. అప్పుడు ఈశ్వరుడు, 'పార్వతీ! ఇల్లు కట్టిన మాత్రాన ఏమి యయ్యె? ఎలుకలు మనకన్న ముందె జేరు. ఎలుకలను చంపుటకు ఒక పిల్లి, ఆ పిల్లిని సాకుటకు పాలు కావాలి. పాలు కావాలంటే ఒక ఆవును కొనాలి. ఆ ఆవును కొనటానికి డబ్బులు కావాలి. ఇల్లు కట్టటం, సంసారం చేయటం అంటే ఏదో సామాన్యమైన విషయమని నీవు అనుకుంటున్నావు. కాదు, కాదు.

sri sathyasai vahini amrutam

ఇలాంటివి ఆశించకూడదు. నన్ను ఇష్టపడిన తరువాత నీవు మిగిలినవన్నీ కోరకూడదు', అని చెప్పాడు.

**అంతా వదలిపెట్టి వట్టి చేతులతో పోవలసిందే!**

ప్రాపంచికమైన ధన ధాన్య కనక వస్తువాహనాదులన్నీ వ్యర్థమయ్యేటటు వంటివే! ప్రపంచంలో అనేక దేశాలను జయిస్తూ అలెగ్జాండర్ గొప్ప సైన్యంతో భారతదేశానికి వచ్చాడు. ఆ సమయంలో అతని ఆరోగ్యం క్షీణించింది. వైద్యులు పరీక్షించి అతనింక బ్రతికే అవకాశం లేదన్నారు. అప్పుడు అలెగ్జాండర్ తన మంత్రులను సమావేశపరచి, "నేను మరణిస్తున్నానన్న చింత నాకేమాత్రము లేదు. నేను ఆనందంగానే ఉన్నాను. అయితే, నాదొక్క చిన్న కోరిక ఉంది. నేను మరణించిన తరువాత నా దేహాన్ని ఒక తెల్లని బట్టలో చుట్టి, చేతులు మాత్రం పైకి పెట్టి నా గ్రామంలో వీధివీధిలోను ఊరేగిస్తూ తీసుకు వెళ్లండి. ప్రజలందరూ 'ఎందుకు మహారాజు చేతులు పైకి పెట్టారు?' అని అడుగుతారు. 'అలెగ్జాండర్ చాలా గొప్పవాడు. ఆయనకు వేలాది సిపాయిలున్నారు; కావలసినంత మంది బంధుమిత్రులు ఉన్నారు. ఆయన అనేక దేశాలను జయించి గొప్ప సిరిసంపదల నార్జించాడు. కాని, పోయే సమయంలో అంతా వదలిపెట్టి వట్టి చేతులతోనే పోయాడు', అని చెప్పండి", అన్నాడు.

> నిరత సత్య ప్రౌఢి ధరణి నేలిన హరి
> శ్చంద్రుడీ ధర బాసి చనగలేదె!
> ఎల్ల లోకము లేలి ఎసగు శ్రీ నలరాజు
> తన వెంట భూమిని గొనుచు చనెనె!
> కృతయుగంబు నలంకృతిని చేయు మాంధాత
> సిరి మూట గట్టుగ అరిగినాడె!
> జలధి సేతువు గట్టె అలనాటి శ్రీరాము
> డుర్విపై యిప్పుడు ఉన్నవాడె!
> ఎందరెందరు రాజులు ఏగినారొ!

sri sathyasai vachanamrutam

**ఒక్కరును వెంట గొనిపోరు ఉర్వితలము**
**నీవు మాత్రము రాజ్యంబు భోగములను**
**తలను కట్టుకపోదువా ధర్మహృదయ!**

పోయేటప్పుడు మీరు ఒక నయాపైసాకూడను తీసుకుపోవడానికి వీలుకాదు. ఇంత మట్టినికూడా తీసుకు పోలేరు. మానవుడు తాను ఎంతో గొప్పవాడినని, కోటీశ్వరుడనని భావిస్తాడు. మొన్న హైదరాబాదులో ఒకాయన నలభై కోట్ల రూపాయలిచ్చి కొంత భూమి కొన్నాడు. ఆయన వెళ్లి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఇంటికి తిరిగి వస్తూండగనే ప్రాణం పోయింది. ఎన్ని కోట్లు సంపాదిస్తే ఏమి ప్రయోజనం! మనకు గుణమే ప్రధానం కాని, ధనం కాదు. దైవబలమే మనకు ప్రధానం. దైవభావమును అభివృద్ధిపరచుకుంటే సర్వము మనకు లభిస్తుంది. ధనముకూడా అవసరమే! తినడానికి తిండి ఉండాలి కదా! కాని, మితిమీరిన ధనము చాలా చెడ్డది. అది ఒక్కొక్కసారి ప్రాణంకూడా తీస్తుంది. మన కుటుంబ పోషణకు తగినంత డబ్బు మనవద్ద ఉండాలి. సమాజానికికూడను కొంతవరకు సహాయం చేయాలి. మనం సమాజంలోనే జీవిస్తున్నాము. సమాజం లేకపోతే మనం లేము. కనుక, సమాజానికి కృతజ్ఞత చూపాలి. మొదట self, ఆపైన సమాజానికి help. ఈ రెండూ ఉంటుంటేనే మానవత్వము జీవిస్తుంది. కేవలం స్వార్థంగా ఉండకూడదు. నిస్వార్థంగా ఉంటూ జీవితాన్ని ఆనందంగా గడుపుతూ పోవాలి.

**మీరు శాంతిని కోరాలన్నదే నా కోరిక!**

నేనెప్పుడుకూడను ఆనందంగా ఉంటాను. దుఃఖమంటే ఏమిటో, కష్టమంటే ఏమిటో, బాధ అంటే ఏమిటో నాకేమీ తెలియదు. ఇండియా ప్రెసిడెంటు వచ్చి, 'మీకూ ఏమైనా కోరికలుంటాయా స్వామీ?' అని అడిగాడు. 'నేను కోరేది ఒక్కటే' అన్నాను. నేను నేనుగా ఉండాలి. ఇతరులపై ఆధారపడి ఉండకూడదు. అందరినీ సంతోషపెట్టాలి. అందరూ ఆనందంగా ఉన్నప్పుడే నేనూ ఆనందంగా ఉంటాను. ఇంతకంటే కావలసినది ఏమున్నది! అందరూ శాంతి (Peace) కావాలని అడుగుతుంటారు. కాని, peace ఎక్కడుంది? మనలోనే ఉంది. బయట ఉన్నదంతా pieces! అది మనకక్కర్లేదు. శాంతిని మననుండియే

srisathyasaivachanamrutam

ఆవిర్భవింప జేసుకోవాలి. ఆవిధమైన జీవితాన్ని గడిపినప్పుడే మన జన్మ ధన్యమవుతుంది. ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని గ్రంథములు చదివినా, ఎన్ని పిహెచ్.డి.లు చేసినా అందరూ కట్టకడపటికి అన్నీ వదలిపెట్టిపోయేవారే! కాబట్టి, శాంతిని కోరండి. మీరు శాంతిని కోరాలన్నదే నా కోరిక. ఎంత ధన, ధాన్యములు కలిగి యున్నప్పటికీ ధర్మగుణము లేకపోతే ప్రయోజన మేమిటి!

**మా పిల్లలు బంగారంవంటివారు**

ఇంతసేపు ఇక్కడ మాట్లాడిన పిల్లవాడు ఢిల్లీ వదలి మా కాలేజికి వచ్చి చేరి మూడు సంవత్సరములైంది. అప్పటినుండి మంచి ఉపన్యాసాలిస్తున్నాడు. తాను ఎవ్వరితోను చేరడు; ఒంటరిగా కూర్చుంటాడు. స్వామి ఆజ్ఞను శిరసావహిస్తాడు. ఇప్పుడు శంకరులవారి చరిత్ర చదువుతున్నాడు. ఆదిశంకరుల విషయ మంతయు అరచేతిలో పెట్టుకున్నాడు. స్వామి ప్రబోధలపై పిహెచ్.డి. చేస్తున్నాడు. ఇటువంటి తపస్సుకోసమే ఇతను పుట్టపర్తికి వచ్చాడు. ఇట్టి పిల్లలు మా దగ్గర ఎంతమందో ఉంటున్నారు.

ఇక్కడ వేదనారాయణ ఉన్నాడు. వాని పేరే వేద నారాయణ; వేదములో చాలా ఆరితేరినటువంటివాడు; గత సంవత్సరం ప్రెసిడెంటు అవార్డును గెల్చుకున్నాడు. ఆయన, "నీ అవార్డు తీసికొని ఎక్కడికి పోతావు?" అని అడుగగా, "నేను పుట్టపర్తికి వెళుతున్నాను. అక్కడే సెటిల్ అయిపోయాను. నేను ఇంకెక్కడికీ పోను", అన్నాడు. అప్పుడాయన "చాలా మంచి పిల్లవాడవు. నీవక్కడే ఉండు నాయనా!" అని చెప్పాడు. ప్రెసిడెంటు మహమ్మదీయుడు. ఆయనకు స్వామి అంటే చాలా భక్తి. ఇలాంటి పెద్దలు అనేకమంది ఇక్కడికి వచ్చి మా పిల్లలను చూసి గొప్పగా వర్ణిస్తుంటారు. మేము పేపర్లో వేసుకోముగాని మా కాలేజిలో ప్రతి ఒక్కరికీ ఫస్టు క్లాసే! అళికెలో చదివిన ఇద్దరు పిల్లలకు మెడికల్, ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఫస్టు ర్యాంకులు వచ్చాయి. వారిద్దరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చాను. వారిని అమెరికాకు పంపాలంటే ఆ బాధ్యతనుకూడా నేను తీసుకున్నాను. 'ఇక్కడే కాదు, అమెరికాలో కూడా మీకు ఫస్టు క్లాసు రావాలి', అని చెప్పి పంపించాను.

మా పిల్లలందరూ బంగారువంటి పిల్లలు; కల్తీ బంగారం కాదు, ప్యూర్ గోల్డ్! ఎటువంటి

sri sathyasai vachanamrutam

పని చెప్పినా చేయడానికి సంసిద్ధులై ఉంటారు. వీళ్లు ప్రతి సంవత్సరం ఒక నెల పల్లెల్లో తిరిగి సేవ చేస్తుంటారు. ఒక్కొక్క ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ అన్నం పెడుతుంటారు. మా పిల్లల్ని చూసి పల్లెలవాళ్లంతా, 'మా స్వామి పంపించారామ్మా మిమ్మల్ని', అంటూ ఎంతో ఆనందిస్తుంటారు. మా పిల్లలు వచ్చే రోజున వాళ్లు తమ ఇల్లంతా అలికి, ముగ్గులు వేసుకుంటారు. స్వామి ప్రసాదాన్ని కళ్లకద్దుకొని స్వీకరించి, ఆనందంగా భుజిస్తారు. మళ్ళీ త్వరలోనే పిల్లలను ప్రసాదం పంచటానికై పల్లెలకు పంపించాలి. మా పిల్లలు చదువులోనే కాదు; ఆటపాటలందు, సంగీత నృత్యములందుకూడను ఆరితేరినవారు. మా పిల్లలు చేయలేని పని ఏ ఒక్కటీ లేదు. పల్లెల్లోగాని, పట్టణాల్లోగాని ఎక్కడికి వెళ్ళినా వాళ్ళు తమ 'కేరక్టర్' విషయంలో అతి జాగ్రత్తగా ఉంటారు. ఆడపిల్లలు, మగపిల్లలు సత్శీలమును ప్రాణసమానంగా భావిస్తారు.

**భగవంతుడు దేహమునిచ్చింది సేవకోసమే!**

అనంతపురంలో 700మంది ఆడపిల్లలు ఉన్నారు. అక్కడ వాళ్లు కూడా ఫస్టుక్లాసులో ఉత్తీర్ణులవుతున్నారు. వాళ్లు ఆడపిల్లలైనప్పటికీ సేవ చేయటానికి పల్లెలకు పోతుంటారు. పాత ఇళ్లు పెరికివేసి కొత్త ఇళ్లు కట్టించి ఇస్తున్నారు. ఆడపిల్లలే స్వయంగా రాతితో ఇళ్లు కట్టి, మంచి పైకప్పు వేసి బీదలకు ఎంతో సహాయం చేశారు. 'మీ ఇళ్లు ఏమైనా కారుతున్నాయా?' అని అడిగితే, 'లేదు స్వామీ, మీ పిల్లలు ఎంత భద్రంగా చేశారు! ఎవరూ చేయని పనిని మీ పిల్లలు ఉచితంగా చేశారు', అన్నారు. మా మగపిల్లలుకూడా అంతే! అనంతపురం, బెంగళూరు, పుట్టపర్తి ఈ మూడు కేంపస్‌లనుండి పిల్లలు గ్రామాలకు వెళ్ళి గ్రామస్థులకు తగినరీతిగా సహాయం చేస్తున్నారు. మా పిల్లలు ఇక్కడికి కేవలం చదువుకోసమని వచ్చినటువంటివారు కాదు. ఎవరైనా సరే, కేవలం చదువుకోసం రావద్దండి. మీకు టైమ్ చిక్కినప్పుడు తప్పకుండా చదువుకోవచ్చు. కాని, మీరు ముఖ్యంగా చేయవలసింది సేవ. భగవంతుడు మీకు శరీరము నిచ్చినది సేవకోసమే! Service is God. Serve all. (సేవయే దైవం. అందరినీ సేవించండి). ఈవిధమైన స్వామి బోధలను ఆచరణలో పెట్టి మా పిల్లలు చక్కని పేరు తెచ్చుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినప్పటికీ సత్యసాయి పిల్లలంటే ప్రజలకు ఎంతో అభిమానం. తెల్లని దుస్తులు ధరించి మా పిల్లలు



sri sathyasai vahini / sri sathyasaivacharamrutam

కనపడితే చాలు, 'వీళ్లంతా సత్యసాయి పిల్లలు; చాలా మంచివారు', అని కొనియాడుతారు. మా పిల్లలు ధరించే దుస్తులూ తెలుపే, వారి హృదయాలు కూడా తెలుపే; చాలా పవిత్ర హృదయులు.

మీరు ప్రతి దినం చూస్తూనే ఉన్నారు, ఈ పిల్లలు నన్ను ఏవిధంగా పట్టుకొని వస్తున్నారో! ఏవిధంగా తీసికొని వెళుతున్నారో! వీరిరువురూ ఎమ్.బి.ఎ. పూర్తి చేశారు. మూడవ పిల్లవానిని ఎమ్.బి.బి.ఎస్.లో చేర్చినాము. ఆదికేశవులు వైదేహి మెడికల్ కాలేజిలో ఇతనికి సీటిచ్చినాడు. బయట ఎక్కడైనా మెడికల్ కాలేజిలో సీటు కావాలంటే పెద్ద మొత్తంలో డొనేషన్ కట్టాలి. కాని, ఆయన మాదగ్గర నయాపైసకూడా తీసుకోలేదు. ఈవిధంగా మా పిల్లల్నెందరినో చేర్చుకున్నాడు. ఆయనొక గొప్ప త్యాగి. బెంగళూరులో శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి దగ్గర్లోనే ఆయన ఉంటున్నాడు. బెంగళూరులో ఉన్న మా హాస్పిటల్స్‌లో కోట్లాది రూపాయల విలువ చేసే పరికరాలున్నాయి. బయటి హాస్పిటల్స్‌లో హార్టు ఆపరేషన్ చేయించుకోవాలంటే లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అనేకమంది బీదలు మన హాస్పిటల్స్‌కి వచ్చి ఉచితంగా ఆపరేషన్లు చేయించుకుంటున్నారు.

విద్య, వైద్యము, ప్రాణాధారమైన నీరు ఈ మూడూ ప్రజలకు ఉచితంగా అందించాలని నేను సంకల్పించుకున్నాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొండల పైకి కూడా పైపులు ఎక్కించి అనేక గ్రామాలకు నీరు సప్లై చేస్తున్నాము. ఆ రెండు జిల్లాల్లో కావలసినంత నీరు పారుతున్నది. కాని, మెట్ట ప్రాంతాలవారికి ఆ నీరు అందటం లేదు. ఇంతకాలమైనప్పటికీ వాళ్లు నీటి సమస్యతో బాధపడుతూనే ఉన్నారు. మేము 100 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పైపులు వేయించి వాళ్లందరికీ నీరు సప్లై చేస్తున్నాము. 'మేము తియ్యని నీరు త్రాగి ఎన్నో సంవత్సరాలైంది. ఈనాడు మళ్లీ మేము పరిశుద్ధమైన నీటిని త్రాగుతున్నాము. మాకు చాలా ఆనందంగా ఉన్నది, స్వామీ', అంటున్నారు వాళ్ళు.

అంతేకాదు, మద్రాసు నగరంలో కూడా అందరికీ నీరిచ్చాము. మద్రాసు ప్రజలు యాభై బస్సుల్లో పుట్టపర్తికి వచ్చారు. 'స్వామీ, మేము మీకు ఎట్లా కృతజ్ఞతలు చెప్పాలి?!' అన్నారు. 'నాకు కృతజ్ఞతలు చెప్పనక్కర్లేదు. నావారికి నేను ఇచ్చుకున్నాను', అన్నాను. మహబూబ్

sri sathyasai vachanamrutam

నగర్, మెదక్ జిల్లాలవాళ్లు వచ్చి, 'మాకు త్రాగునీరు లేదు, స్వామీ!' అన్నారు. కృష్ణానదినుండి వాళ్లకి నీటిని సప్లై చేయించాము. ఈవిధంగా, అన్ని దేశాలకు, అన్ని పల్లెలకు మేము సేవలు చేస్తున్నాము. అందరికీ సేవలు చేయాలి. ఎవరైనా బాధలో ఉన్నట్లు మీ దృష్టికి వస్తే, అతను మీ మిత్రుడు కాకపోయినా సరే, అతనికి సేవ చేయాలి. అవసరమైతే ఆరోజున కాలేజికి సెలవు పెట్టి అతనికి సహాయం చేయాలి. మా పిల్లలగురించి నేను చెప్పుకోకూడదు గాని, నేను చెప్పినదానికంటే ఎంతో ఎక్కువగా పని చేస్తున్నారు. స్వార్థాన్ని త్యాగం చేసి ఇతరులకు సహాయ పడుతున్నారు. ఈవిధమైన త్యాగభావం, సేవానిరతి కలిగిన పిల్లల్ని మేము తయారు చేస్తున్నాము. కనుకనే, వాళ్లు అన్నిరంగాల్లో దినదినాభివృద్ధి నొందుతున్నారు.

మా ప్రైమరీ స్కూల్‌లో చిన్నచిన్న పిల్లలు పన్నెండు వందలమంది ఉన్నారు. తల్లిదండ్రులను విడిచిపెట్టి ఉండలేని పిల్లలు సహితం ఇక్కడికి వచ్చి చేరుతున్నారు. రెండు దినములలోనే వాళ్ళు తమ తల్లిదండ్రులను మరచిపోయి మమ్మల్ని విడిచిపెట్టి ఉండలేని స్థితికి వస్తున్నారు. తల్లిదండ్రులు ఇక్కడికి వచ్చి చూసి, 'ఆహా! మా పిల్లల్లో ఎంత మంచి మార్పు వచ్చింది!' అని ఆనందిస్తుంటారు. తల్లిదండ్రులకంటే అధికమైన ప్రేమను పిల్లలపై చూపుతున్నాము. మా పిల్లల విషయంలో ఇంకా ఎంతైనా చెప్పవచ్చు. వాళ్లని మీరు సామాన్యులుగా భావించకండి. వాళ్లెంతో గొప్పవారు. దేశానికంతా నాయకులు కావలసినటు వంటివారు. పిల్లలు లోకానికి ఆదర్శప్రాయులు కావాలి. అప్పుడే నాకు సంతోషం.

**(తేదీ 16.8.2006 అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vahanamrutam